# కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి



కౌంటింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్

హాజీపూర్, నవంబర్ 14 : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్‌కు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు బిశ్వజిత్ దత్తా, సజ్జనార్ అన్నారు. మంగళవారం ఎన్నికల నిర్వహణలో భాగంగా హాజీపూర్ మండలంలోని ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ బీ రాహుల్, డీసీపీ రామ్‌నాథ్ కేకన్, చెన్నూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాములు, మంచిర్యాల ఏసీపీ తిరుపతి రెడ్డితో కలిసి పరిశీలించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణతో పాటు కౌంటింగ్ సిద్ధంగా ఉండాలన్నారు. చెన్నూర్(ఎస్సీ), బెల్లంపల్లి (ఎస్సీ), మంచిర్యాల నియోజకవర్గాలకు సంబంధించి ఐజా కళాశాలలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులకు కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ జరుగుతాయని, ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 741 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి పని చేయాలని, ఉల్లంఘించినట్లయితే భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మా ఓట్లన్నీ బాల్క సుమన్ కే..



ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద కోట శంకరమ్మ-కిష్టయ్య

- మా బిడ్డ ఎంబీబీఎస్ సీట్‌కు ఆర్థిక సాయం చేసిండు
- అన్నారంలో ఇంటి ముందు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దివ్యాంగ దంపతులు

కోటపల్లి, నవంబర్ 13 : 'మా ఇంట్లో అందరి ఓట్లు బాల్క సుమన్ అన్నగారి కారు గుర్తుకే.. దయచేసి కాంగ్రెస్, బీజేపీ వాళ్లు మా ఇంటికి రాకండి..' ఇది కోటపల్లి మండలం అన్నారం గ్రామంలో దివ్యాంగ దంపతులు తమ ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ సారాంశం..

కోటపల్లి మండలం అన్నారం గ్రామంలోని దివ్యాంగ దంపతులు బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలిపారు. అన్నారం గ్రామానికి చెందిన కోట శంకరమ్మ-కిష్టయ్య ఇద్దరూ దివ్యాంగులు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరి కూతురు కోట రవీణకు ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. ఫీజు చెల్లించే స్థోమత లేక వైద్య విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొన్నది. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆ విద్యార్థినిని ఇంటికి పిలిపించి, ఆమె వైద్య విద్యకు భరోసా ఇచ్చాడు. మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో చేర్పించి, రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఆ విద్యార్థిని వైద్య విద్య పూర్తి చదువుకు హామీఇచ్చారు. ఆ విద్యార్థిని నేడు ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, ఆ నిరుపేద తల్లిదండ్రుల కల అతి త్వరలోనే నెరవేరనున్నది. కాగా, నిరుపేద విద్యార్థినికి పెద్దన్న మాదిరి ఆదుకొని, వైద్య చదువు అందిస్తున్న బాల్క సుమన్‌కే తమ సంపూర్ణ మద్దుతు ఉంటుందని, తాము బాల్క సుమన్ గారి కారు గుర్తుకు తప్ప వేరే ఏ పార్టీకీ ఓటు వేయబోమని కోట శంకరమ్మ-కిష్టయ్య స్పష్టం చేస్తున్నారు. తమ ఇంటికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఓట్ల కోసం రావద్దని ఇంటి గుమ్మానికి ఫ్లెక్సీని అంటించి, ఆ నిరుపేద కుటుంబం బీఆర్ఎస్ ప్రభుత్వంపై, బాల్క సుమన్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నది.

**బాల్క సుమన్ కే మా ఓటు..**

పేదోడి బిడ్డకు పెద్ద చదువు అందిస్తున్న బాల్క సుమన్‌కే మా ఓటు. మా బిడ్డ రవీణకు ఎంబీబీఎస్ సీటు వస్తే ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న మాకు మా ఎమ్మెల్యే బాల్క సుమన్ పెద్దన్నలెక్క ముందు నిలిచిండు. లక్ష రూపాయాల ఆర్థిక సాయం అందించడంతో పాటు, వైద్య విద్య చదువుకు పూర్తి సహకారం అందిస్తా అని చెప్పి భరోసా కల్పించిండు. అలాంటి నాయకుడు మళ్లీ ఎమ్మెల్యే అయితే మాలాంటి పేదల జీవితాల్లో నిజంగా వెలుగువస్తది. బాల్క సుమన్ ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి పనులు చేయడంతో పాటు పేదలకు తనవంతు సాయం అందచేసి పేదల ఎమ్మెల్యేగా నిలిచిండు. అలాంటి వ్యక్తిని మళ్లీ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నది. **- కోట శంకరమ్మ-కిష్టయ్య**

# ప్రజా ఆశీర్వాద సభకు అన్ని ఏర్పాట్లు

- మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు




నస్పూర్‌లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సీసీసీ నస్పూర్, నవంబర్ 14 : నస్పూర్‌లో ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. నస్పూర్‌లోని మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో ఉన్న హెలీప్యాడ్ స్థలం, సమీపంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ స్థలాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డితో కలిసి పరిశీలించారు. సీఎం సభకు నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు డీకొండ అన్నయ్య, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు పానుగంటి సత్తయ్య, బండి పద్మ, హైమద్, పెంచాల వేణు, చిడం మహేశ్, బండారి తిరుపతి, కొమురయ్య ఉన్నారు.

# కేటీఆర్ రోడ్‌షో ఏర్పాట్లు పరిశీలన

మంచిర్యాలటౌన్, నవంబర్ 14: మంచిర్యాలలో ఈ నెల 17వ తేదీన మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ రోడ్‌షో సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు, ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రసాద్‌రావు పరిశీలించారు. మంత్రి కేటీఆర్ మధ్యాహ్నం 1 గంట సమయంలో పట్టణంలో రోడ్‌షో నిర్వహించిన అనంతరం ఐబీ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అంతకుముందు సీసీసీ నస్పూర్ కలెక్టరేట్ సమీపంలోని హెలిప్యాడ్‌ను పరిశీలించారు. కేటీఆర్ రోడ్‌షో సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో వారు చర్చించారు. రోడ్‌షో నిర్వహించే మ్యాప్‌ను వారు పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు హరికృష్ణ, మాదంశెట్టి సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రకాశ్‌నాయక్, నాయకులు ఎర్రం తిరుపతి, తోట తిరుపతి, బొలిశెట్టి కిషన్, గట్టయ్య, గొంగళ్ల శంకర్, ఆరె శ్రీనివాస్, అమ్జద్, సాగర్‌యాదవ్ ఉన్నారు.



ఐబీ చౌరస్తాలో రోడ్‌షో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు

# ఓటు హక్కును వినియోగించుకోవాలి



కాసిపేట: ఫ్లాగ్ మార్చ్‌లో ఏసీపీ పంతాటి సదయ్య, సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసులు

కాసిపేట, నవంబర్ 14 : ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య పేర్కొన్నారు. మంగళవారం కాసిపేటలో బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఆధ్వర్యంలో ముత్యంపల్లి నుంచి కాసిపేట వరకు 70 మంది మందమర్రి పోలీస్ సర్కిల్ సిబ్బందితో పాటు ఎఫ్ కంపెనీ సీఆర్‌పీఎఫ్ బలగాలు, ఉమెన్ బెటాలియన్ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ గంగారాం, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, పలువురు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి, నవంబర్ 14 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జైపూర్ ఏసీపీ మోహన్ సూచించారు. కోటపల్లిలో చెన్నూర్ రూరల్ పోలీస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రజలకు అండగా పోలీస్ శాఖ పని చేస్తుందని, ఎవరూ కూడా ప్రలోబాలకు లొంగకుండా బాధ్యతాయుతంగా ఓటు వేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీస్‌ల ప్రత్యేక నిఘా ఉందని, ప్రతి కేంద్రంలో వంద శాతం ఓటింగ్ జరిపించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, చెన్నూర్ సీఐ వాసుదేవ రావు, కోటపల్లి, నీల్వాయి, భీమారం ఎస్ఐలు సురేశ్, సుబ్బారావు, రాజవర్ధన్ పోలీసులు పాల్గొన్నారు.



కోటపల్లి ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న జైపూర్ ఏసీపీ మోహన్, సీఐ, ఎస్ఐలు, పోలీస్‌లు